తెల్లారితే పెండ్లి .. వరుడి ఆత్మహత్య

- జగిత్యాల జిల్లా రామచంద్రంపేటలో విషాదం

కిరణ్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి 8: ఆ ఇంట్లో తెల్లారితే పెండ్లి .. ఓ వైపు పెండ్లి పనులు కొనసాగుతున్నాయి. ఇంతలోనే పెండ్లి కొడుకు ఉరేసుకొని ఆత్మహత్య .. ఈ విషాదకర ఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల అనుబంధ గ్రామం రామచంద్రంపేటలో చోటుచేసుకున్నది. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..రామచంద్రంపేటకు చెందిన లక్కంపెల్లి కిరణ్(37) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వెల్లుల్లకు చెందిన యువతితో ఈనెల 9న వివాహం నిశ్చయించారు. శుక్రవారం రాత్రి కిరణ్ తన గదిలో పడుకోగా,శనివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా కిరణ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. కిరణ్‌కు ఆరోగ్య సమస్యలు ఉండడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

కోతులకు కళ్లెం వేసేదెలా..?

- నిర్మల్‌లోని రెస్క్యూ సెంటర్‌లో పెరగని స్టెరిలైజేషన్లు
- నిధుల కొరతతో సహకరించని స్థానిక సంస్థలు
- నాలుగేళ్లలో 1547 స్టెరిలైజేషన్లు
- బీఆర్ఎస్ హయాంలోనే మొదటిసారిగా సెంటర్ ఏర్పాటు

నిర్మల్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోజురోజుకూ కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో వాటి ఆగడాలు తాళలేక ప్రజలతోపాటు రైతులు బెంబేలెత్తుతున్నారు. వీటి సంతాన ఉత్పత్తి ప్రక్రియ వేగంగా కొనసాగుతూ ఉండడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. రాత్రింబవళ్లు వీటి సంచారంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే పొలాలపై కూడా కోతుల గుంపులు దాడులు చేసి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ఈ సమస్యపై గతంలో కేసీఆర్ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో నిర్మల్ శివారులోని గండిరామన్న హరితవనం ప్రాంగణంలో రాష్ట్రంలోనే ఏకైక మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. అయితే వన్య ప్రాణుల రక్షణ చట్టానికి అనుగుణంగా కోతులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఒక డాక్టర్‌తోపాటు ఫార్మాసిస్టు, నలుగురు అటవీ సిబ్బందిని నియమించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు కోతులను పట్టించి ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌కు తీసుకొస్తే వాటికి స్టెరిలైజేషన్(కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. అయితే నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల నిర్లక్ష్యం కారణంగా కేవలం 1547 స్టెరిలైజేషన్లు మాత్రమే చేశారు. ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో నెలకు దాదాపు 500లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కో కోతిని పట్టేందుకు రూ.1000 వరకు ఖర్చు అవుతుండడంతో అసలే నిధుల కొరతతో సతమతమవుతున్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఇది మరింత భారంగా మారింది. కోతుల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, నిధుల కొరత కారణంగా వాటిని పట్టించే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు మాజీ సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు పేర్కొంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ చూపి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వీడీసీలు ముందుకు రావాలి..

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో కొనసాగుతున్న వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)లు కోతుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వీడీసీలు సమాంతర వ్యవస్థ నడుపుతుండడమే కాకుండా అక్కడి ఆర్థిక వనరులన్నింటినీ తమ గుప్పిట్లో ఉంచుకున్నాయన్న వాదనలున్నాయి. గ్రామ పంచాయతీల కన్నా వీడీసీలే ఆర్థికంగా బలంగా ఉండడంతో కోతుల తరలింపు బాధ్యతను కూడా ఆయా వీడీసీలే తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టాటూలతో స్టెరిలైజేషన్ గుర్తింపు ఈజీ..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేసిన కోతులకు ఇక్కడి వైద్య సిబ్బంది వాటి నుదుటిపై టాటూలు వేస్తున్నారు. ఇలా టాటూలు కనిపించిన కోతికి స్టెరిలైజేషన్ పూర్తయినట్లు ఈజీగా తెలిసిపోతుంది. స్టెరిలైజేషన్ పూర్తయిన కోతులకు ఇక సంతానోత్పత్తికి అవకాశం ఉండదు. దీంతో క్రమంగా వాటి సంఖ్యను తగ్గించవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. 2 నుంచి 3 ఏళ్ల వయసు ఉండడం లేదా వయసు తక్కువగా ఉన్నప్పటికీ బలంగా ఉన్న కోతులకు స్టెరిలైజేషన్ చేస్తున్నారు.

సౌకర్యాలు ఉన్నాయి.. సద్వినియోగం చేసుకోండి..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ రిహాబిటేషన్ సెంటర్‌లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి సెంటర్ నిర్వహణకు వైద్యుడితోపాటు అవసరమైన మేరకు సిబ్బంది కూడా ఉన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు చొరవ తీసుకుని కోతులను పట్టించి సెంటర్‌కు తీసుకురావాలి. ప్రతినెల 500లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. కోతుల సంతానాన్ని నిరోధించాలంటే స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం.

–డాక్టర్ శ్రీఖర్‌రాజు, మంకీ రెస్క్యూ సెంటర్ మెడికల్ ఆఫీసర్, నిర్మల్.

నవీపేటలో కిటకిటలాడుతున్న మేకల అంగడి

మేకల అంగడి @ రూ.4 కోట్లు

- నవీపేటలో జోరుగా జీవాల క్రయవిక్రయాలు

నవీపేట, మార్చి 8: నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మేకల అంగడిలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన మేకలు, గొర్రెల క్రయ విక్రయాలతో రూ.4 కోట్లకుపైగా వ్యాపారం జరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 14న హోలీ పండుగతోపాటు వరుసగా వివాహాలు, శుభకార్యాలు ఉండటంతో అంగడికి మరింత డిమాండ్ పెరిగింది. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పుణె, ఉత్తరప్రదేశ్, హర్యానా, కర్ణాటక, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు పెద్ద మొత్తంలో జీవాల క్రయవిక్రయాలు చేపట్టారు. జీవాలతో అంగడి కిక్కిరిసిపోవడంతో బాసర రోడ్డు పైనే క్రయవిక్రయాలు కొనసాగాయి.

అటకెక్కిన చేనేత పథకాలు !

- వచ్చే బడ్జెట్‌లోనూ నేతకార్మికులకు మొండి చెయ్యి తప్పదా..?
- సంక్షేమ బోర్డుకు రూ.1000 కోట్లు ఏవని ప్రశ్నిస్తున్న నేతలు
- రూ.5 లక్షల పెట్టుబడి సాయం మరిచిన కాంగ్రెస్ సర్కార్
- రేవంత్ తీరుపై కార్మికుల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత రంగాన్ని కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విస్మరించింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేతలతోపాటు పవర్ కార్మికులనూ కష్టాలపాలు చేసింది. విజయవంతంగా కొనసాగుతున్న వస్త్ర కార్మికుల పథకాలను రద్దు చేసింది. బీఆర్ఎస్ హయాంలో ఆదరణ పొందిన బతుకమ్మ చీరల పథకంపై సీఎం రేవంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కడంతోపాటు ఏకంగా ఆ పథకాన్నే రద్దు చేశాడు. దీంతో వస్త్ర కార్మికులకు రాష్ట్రంలో ఉపాధి లేకుండా పోయింది. పనులు లేక, మగ్గాలు నడువక, పస్తులు ఉండలేక నేత కార్మికులకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి.

'రెండు చీరల' పథకం అమలు ఎప్పుడు..?

బతుకమ్మ చీరల పథకం బదులుగా 'రెండు చీరల' పథకం ప్రవేశ పెట్టినట్టు సర్కారు పేర్కొన్నది. ఇంత వరకు దాని ఊసే లేదు. పైగా ఈ పథకం అమలుకు రూ.400 కోట్లకుపైగా కేటాయిస్తున్నామని, ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచే అమల్లోకి తెస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాని ఇప్పటికీ నేతన్నలకు చీరల తయారీ బాధ్యతలూ ఇవ్వలేదు. పైగా ఈ సర్కారు అధి కారంలోకి వచ్చిన తర్వాత చేనేత చేయూత పథకంతోపాటు త్రిఫ్ట్ పథకాన్ని, నూలు రం గులకు నగదు బదిలీని కూడా రద్దు చేసింది.

నిధులు పెంచండి: నేత కార్మికులు

2025–26 ఆర్థిక సంవత్సరంలో అయినా వస్త్ర పరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని, సబ్సిడీల అమలుతోపాటు రూ.1000 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకుడు చెర్కు స్వామి, తెలంగాణ పవర్ లూమ్ కార్మిక సంఘం నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. ప్రతి నేత కార్మికుడికి రూ.5 లక్షల బీమా, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇండ్లు లేని కార్మికులకు హౌస్ కం వర్క్‌షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. టెస్కో ద్వారా చేనేత సహకార సంఘాలలో నిల్వ ఉన్న వస్త్రాలను కొనుగోలు చేసి, నిధులు విడుదల చేయాలని కోరారు.

ఫాల్కన్ స్కామ్ నిందితుడి విమానం సీజ్

శంషాబాద్ రూరల్, మార్చి 8: ఫాల్కన్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ చార్టర్డ్ విమానాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీజ్ చేసింది. దుబాయ్ నుంచి ఆ విమానం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చినట్టు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి వెళ్లి సీజ్ చేసినట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. ఫాల్కన్ కుంభకోణం ద్వారా కొల్లగొట్టిన సొమ్ము నుంచి అమర్‌దీప్ రూ.14 కోట్లు వెచ్చించి ఆ విమానాన్ని కొనుగోలు చేసినట్టు గుర్తించామని తెలిపారు. అమర్‌దీప్ సహా ఈ స్కామ్‌లోని కీలక నిందితులు పరారీలో ఉన్నారని, ప్రస్తుతం పవన్, కావ్య అనే ఇద్దరు వ్యక్తులను మాత్రమే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పెట్టుబడుల పేరుతో 6,979 మందిని మోసగించి రూ.1,700 కోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాల్కన్ గ్రూప్‌పై కేసు నమోదైన విషయం విదితమే. దీన్ని ఆధారంగా ఈడీ దర్యాప్తు జరుపుతోంది.

రోడ్డుపై గుంతలను పూడ్చి వేయిస్తున్న పీఆర్ ఈఈ, సీఐ, ఎస్సై

ఎట్టకేలకు ఉచిత రవాణా

'నమస్తే కథనం'తో దారి దోపిడీకి చెక్

నమస్తే ఎఫెక్ట్

టేకుమట్ల, మార్చి 8 : అంతర్ జిల్లాలను కలిపే మానేరు వాగుపై ఎట్టకేలకు ఉచిత రవాణ కొనసాగుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి– పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడెడు గ్రామాల మధ్య మానేరువాగులో అక్రమ వసూళ్ల దందాపై ఈ నెల 1న 'దర్జాగా దారి దోపిడీ' కథనం 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీంతో అధికారులు టోల్ తీసేశారు. దీనిని జీర్ణించుకోలేని దుండగులు మట్టిరోడ్డుపై గుంతలు తవ్వి రవాణాకు ఆటంకం కలిగించారు. దీంతో 'మానేరు వాగులో రోడ్డుపై గుంతలు' కథనం శుక్రవారం జిల్లా పేజీలో వచ్చింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. శనివారం పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్, టేకుమట్ల ఎస్సై సుధాకర్ వాగును సందర్శించి రోడ్డుపై తవ్విన గుంతలను జేసీబీతో పూడ్చివేయించారు. ఎవరైనా రోడ్డును ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్లాక్ మెయిలింగ్.. అక్రమ వసూళ్లు

- ఇరిగేషన్ డీఈఈ ఫిర్యాదుతో విలేకరి అరెస్ట్

మెట్‌పల్లి, మార్చి 8: ఆర్ఆర్ న్యూస్ విలేకరిగా చలామణి అవుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మెట్‌పల్లి పట్టణానికి చెందిన గట్టుపల్లి రాజశేఖర్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్ ఆర్ఆర్ న్యూస్ విలేకరి అని చెప్పుకొంటూ అమాయక ప్రజలు, వ్యాపారులు, ప్రభుత్వ అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ కొంత కాలంగా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నాడు. వివిధ సమస్యలతో ఉన్న బాధితులను గుర్తించి వారి వద్దకు వెళ్లి తాను విలేకరినని, తనకు పోలీస్ అధికారులతో మంచి పరిచయాలు ఉన్నాయని నమ్మించి సమస్య పరిష్కరిస్తానని పైరవీ చేసి డబ్బులు సంపాదించాలని ప్రయత్నించాడు. ఇలా రెండు, మూడు సార్లు కొందరిని తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు పైరవీ చేసేందుకు రాగా అవి బెడిసికొట్టడంతో పోలీస్ అధికారులను అప్రతిష్టపాలు చేసేందుకు కూడా పలు మార్లు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గత నెల 12న మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటలో మొరం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన ఇరిగేషన్ డీఈఈ అరుణోదయ్‌కుమార్‌ను కొందరు బ్లాక్‌మెయిల్ చేసి రూ.1.50 లక్షలు వసూలు చేసినట్లు తెలుసుకున్న రాజశేఖర్ తాను కూడా బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు వసూలు చేయాలని పథకం వేశాడు. ఈ నెల 5న ఎస్సారెస్పీ క్యాంపు కార్యాలయంలో డీఈఈ ఉండగా అక్కడికి వెళ్లి తనకు రూ.లక్ష ఇవ్వాలని, లేకపోతే తన న్యూస్‌లో తప్పుడు కథనాలు ప్రసారం చేస్తానంటూ బెదిరించాడు. భయపడిన డీఈఈ రూ. 5 వేలు రాజశేఖర్‌కు ఇచ్చాడు. మిగతా డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పాడు. అంతటితో ఆగకుండా ఆర్ఆర్ న్యూస్‌లో ఇరిగేషన్ అధికారిపై తప్పుడు కథనాన్ని ప్రసారం చేశాడు. ఈ కథనాన్ని అన్ని గ్రూపుల్లో వైరల్ చేస్తానని, మిగతా డబ్బులు ఇవ్వాలంటూ మళ్లీ బ్లాక్‌మెయిల్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. రాజశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

గంజాయి విక్రేతల అరెస్ట్

మెట్‌పల్లి, మార్చి 8: గంజాయి విక్రయించేందుకు మెట్‌పల్లికి తీసుకు వస్తున్న ఇద్దరి యువకులను అరెస్టు చేసినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సీఐ కథనం ప్రకారం... మెట్‌పల్లి శివారులోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో శనివారం సాయంత్రం ఎస్ఐ కిరణ్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు యువకులను ఆపి తనిఖీ చేయగా గంజాయి దొరికింది. ఇబ్రాహీంపట్నం మండలం ఎర్రాపూర్ తండాకు చెందిన నునావత్ సాయినాయక్, నిర్మల్ జిల్లా ఊట్నూర్ మండలం కొమ్ముగూడెంకు చెందిన అజ్మీర శ్రీనివాస్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు కలిసి కొమ్ముగూడెంలో చౌహాన్ రమేశ్‌నాయక్ వద్ద రూ. 3 వేలకు గంజాయి కొనుగోలు చేశారు. చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు మెట్‌పల్లి పట్టణానికి తీసుకువస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను అరెస్ట్ చేసి గంజాయి, మోటార్ సైకిల్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న చౌహాన్ రమేశ్‌నాయక్‌ను పట్టుకుంటామని వివరించారు. గంజాయి విక్రేతలను పట్టుకున్న ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి, మార్చి 8: కేసుల సత్వర పరిష్కారం కోసం కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి నాగేశ్వర్ రావు సూచించారు. స్థానిక సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల్లో శనివారం న్యాయమూర్తులు నాగేశ్వర్‌రావు, అరుణ్‌కుమార్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సివిల్, క్రిమినల్ కేసులను రాజీమార్గంలో పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఎస్ఐ కిరణ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే మహిళలకు పెద్దపీట

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల రూరల్, మార్చి 8: బీఆర్ఎస్ హయాంలోనే మహిళల అభ్యున్నతి, సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామంలో శనివారం ఆమె మహిళలతో కలిసి మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, తెలంగాణ క్యాతి, సంప్రదాయం, బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన, బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకే మహాధర్నా

- రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి

మేడిపల్లిలో నినాదాలు చేస్తున్న రైతు ఐక్యవేదిక నాయకులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 8: పసుపు రైతుల న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకే రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న మెట్‌పల్లిలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి తెలిపారు. మెట్‌పల్లి మండలం మేడిపల్లి, బండలింగాపూర్, ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామాల్లో శనివారం ఆయన రైతులు, రైతు సంఘాల నాయకులు, గ్రామ పెద్దలను కలిశారు. మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి పసుపు క్వింటాల్‌కు రూ. 15 వేలు కనీస మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఎలిసె పాపన్న, కొట్టాల మోహన్‌రెడ్డి, కర్నె రాజేందర్‌రెడ్డి, చిన్నారెడ్డి, బద్దం గోపి, కంతి మోహన్‌రెడ్డి, తీగల శ్రీధర్‌రెడ్డి, అలిశెట్టి మోహన్, గంగారెడ్డి, రాజశేఖర్, రమేశ్, ఏలేటి రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నల్ల ధనయ్య, చిట్యాల జలేందర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు పకడ్బందీ చర్యలు

- ఎస్పీ అశోక్‌కుమార్

కోరుట్ల, మార్చి 8: ప్రయాణికుల భద్రత కోసం పోలీస్ శాఖ పకడ్బందీగా భద్రత చర్యలు తీసుకుంటున్నదని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'మై ఆటో ఇజ్ సేఫ్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు, చిన్నారులు, వృద్ధుల రక్షణ బాధ్యత ఆటో డ్రైవర్లు తీసుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న నేరాల కట్టడికి ప్రభుత్వం ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తున్నదని చెప్పారు. ప్రజల భద్రత, ఆటో డ్రైవర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 4000 ఆటోలు తిరుగుతున్నాయని, 2093 ఆటోలను పోలీస్ స్టేషన్లకు క్యూ ఆర్ కోడ్, రిజిస్ట్రేషన్ నెంబర్లు కేటాయించి అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ తమ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆటోలపై పోలీసులు సూచించిన భద్రతాపరమైన స్టిక్కర్లను అతికించుకోవాలని సూచించారు. ప్రజలు క్యూర్ కోడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు ఆటోలకు పోలీసు శాఖ క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లను ఎస్పీ అతికించారు. పలువురు ఆటో యూనియన్ సభ్యులను సత్కరించారు. సమావేశంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేశ్ బాబు, ఎంవీఐ శ్రీనివాస్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ఎస్ఐలు శ్రీకాంత్, రామచంద్రం, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

బిర్యానీలో ఈగ

- కోరుట్లలోని ఇష్టా రెస్టారెంట్‌లో ఘటన
- కంగుతున్న కస్టమర్లు
- యాజమాన్యం నిర్లక్ష్యపు సమాధానం
- రెస్టారెంట్‌పై మున్సిపల్ అధికారుల కొరఢా
- నిల్వఉన్న ఆహార పదార్థాలు స్వాధీనం, జరిమానా

కోరుట్ల, మార్చి 8: కోరుట్ల పట్టణంలోని ఇష్టా రెస్టారెంట్‌లో ఓ కస్టమర్ చికెన్ బిర్యానీ ఆర్డర్ ఇవ్వగా అందులో ఈగ దర్శనమిచ్చింది. దీంతో కంగుతిన్న కస్టమర్ యాజమాన్యాన్ని ఇదేంటని నిలదీయగా, అనుకోకుండా వచ్చిందంటూ వారు నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు. ఈ విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మున్సిపల్ అధికారులు ఇష్టా రెస్టారెంట్‌పై కొరఢా ఝులిపించారు. రెస్టారెంట్‌లో నిల్వఉన్న ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు యజమానికి రూ.10వేల జరిమానా విధించారు. అలాగే ఇటీవల ఈ రెస్టారెంట్‌లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించి కుళ్లిన మాంసం, మిగిలిపోయిన ఆహారం స్వాధీనం చేసుకొని రూ.12వేలు జరిమానా విధించారు. రెస్టారెంట్‌లో నాసిరకం ఆహార పదార్థాలు వడ్డిస్తున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల్లో మున్సిపల్ మేనేజర్ క్రాంతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ సాలియా నాయక్

మెట్‌పల్లి రూరల్, మార్చి 8: వేసవిలో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాలియా నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఆత్మకూర్, మెట్లచిట్టాపూర్ సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేసిన అదనపు వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్లను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, గతంలో ఒకే బ్రేకర్‌పై రెండు అంతకంటే ఎక్కువ ఫీడర్లు ఉండడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగేదన్నారు. ప్రస్తుతం అన్ని సబ్‌స్టేషన్లలో ప్రతి ఫీడర్‌కు ఒక బ్రేకర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు తమ పంపుసెట్లకు విధిగా కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. కాగా, వెల్లుల్లలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించి లో–వోల్టేజీ సమస్యను పరిష్కరించగా, గ్రామస్తులు విద్యుత్ అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో డీఈలు గంగారాం, రవీందర్, ఏడీఈ దురిశెట్టి మనోహర్, ఏఈ అజయ్, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దుండగులను శిక్షిస్తాం

సారంగాపూర్, మార్చి 8: అంబేద్కర్‌ను విగ్రహాన్ని అవమానపరిచిన దుండగులను ప్రభుత్వ పరంగా శిక్షిస్తామని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నాగునూర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి శనివారం వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, సతీశ్, హనుమాన్ రెడ్డి, రాజ్‌కుమార్, అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు శోభన్, దళిత సంఘం నాయకులు శంకర్, గంగాధర్, రమేశ్, నరేశ్, నారాయణ, జీవన్, సతీశ్, ఇజ్రాయిల్, శేఖర్, ప్రవీణ్, రవి, ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారాం, తదితరులు పాల్గొన్నారు.